కూల్చివేత ఘటన వివరాలను తహశీల్దార్‌కు వివరిస్తున్న వందవాసి నాగరాజు

# పన్నుల భారం.. మోయాల్సిందే... 'పరివారం'



**'ఖజానా ఖాళీ.. మీరు ఏం చేస్తారో తెలియదు.. మాకు ఇంత లక్ష్యం పూర్తవ్వాలి..' అని కూటమి ప్రభుత్వం కార్పొరేషన్లకు టార్గెట్ విధించడంతో అధికారులు వ్యూహరచన చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా ఆశించవద్దని తేల్చి చెప్పేసింది. దీంతో ఏఏ మార్గాల్లో భారం అని తెలియకుండా పెంచి, లక్ష్యం చేరుకోవచ్చో అని కార్పొరేషన్ అధికారులు అన్వేషిస్తున్నారు. ఇందుకుగాను రహస్య సర్వేలు చేస్తున్నారు. పెంచితే ప్రజలతో తంటా.. పెంచకపోతే టార్గెట్లు చేరుకోలేమనే చింత.. దీంతో రాయలసీమ పరిధిలో రూ.54.80 కోట్ల భారం రాబట్టుకోడానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో రూ.18 కోట్ల 25 లక్షలు, కడపలో రూ.11 కోట్ల 21 లక్షలు, అనంతపురంలో రూ.9 కోట్ల 80 లక్షలు, కర్నూలులో రూ.15 కోట్ల 54 లక్షలు భారం మోపేందుకు లెక్కలు పక్కాగా సిద్ధమయ్యాయని తెలుస్తోంది.**

ఆస్తిపన్ను పెంపుకు రహస్య సర్వే
'లోపాలను' గుర్తించడమే 'వ్యూహం'
కమిషనర్ల నుంచి 'స్వీయ' ధృవీకరణ
తిరుపతి ప్రజలపై రూ.18.25 కోట్ల భారం
'రాయలసీమ'కు రూ.54.80 కోట్ల పైనే..

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

తిరుపతి స్మార్ట్‌సిటీకి రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.400 కోట్ల రూపాయలను గత ఐదేళ్లుగా ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో చాలా ప్రాజెక్టులు అర్ధాంతరంగానే ఆగిపోయాయి. కొన్ని పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధులు కేటాయించకనే తిరుపతి స్మార్ట్‌సిటీ పథకం కాలం ముగిసింది. ఒక్క తిరుపతికే కాదు. రాయలసీమ పరిధిలోని కడప, కర్నూలు, అనంతపురం కార్పొరేషన్లకు నిధులను ఇవ్వలేదు. ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకపోగా, ప్రస్తుతం రహస్య సర్వే నిర్వహించి పన్నుల భారం ప్రజలపై మోపి, ఖజానా నింపుకోవాలని చూస్తోంది. సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటా సర్వే రహస్యంగా జరుగుతోంది.

**తిరుపతి ప్రజలపై రూ.18.25 కోట్ల భారం**

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలపై 18 కోట్ల 25 లక్షలు భారం పడనుంది. ఇప్పటికే ఆస్తి పన్నుల రూపంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రభుత్వ ప్రైవేటు సంస్థల నుంచి ఏడాదికి 90 కోట్ల రూపాయలు పన్నుల రూపంలో వస్తుంది. ఇది కాకుండా రాష్ట్ర ప్రభుత్వం 18 కోట్ల 25 లక్షలు లక్ష్యం ఇవ్వడంతో ప్రజలను పిండి పిప్పి చేసి వసూలు చేసే కార్యక్రమం మొదలయ్యింది. 2024-25 సంవత్సరం గాను తిరుపతి కార్పొరేషన్ రాష్ట్రంలోనే ఆస్తి పన్నుల వసూళ్లలో మూడో స్థానంలో నిలిచి అవార్డు కైవసం చేసుకుంది. రాయలసీమ వాసులపై 54 కోట్ల 80 లక్షల రూపాయలు భారం పడనుంది. ఆస్తి పన్నులు పెరిగితే అద్దె ఇళ్లల్లో ఉండే వారికి 'అద్దె' పెరిగే ప్రమాదం ఉంది.

మరోవైపు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు టీటీడీ శ్రీనివాసం, విష్ణు నివాసం, మాధవం సంబంధించి సుమారు 100 కోట్ల రూపాయలు ఆస్తి పన్నులు చెల్లించకుండా ఎగ్గొట్టింది. ఈ పన్నులు టిటిడి చెల్లిస్తే తిరుపతి కార్పొరేషన్ ప్రజలపై భారం చాలావరకు తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తిరుపతి కార్పొరేషన్‌కు టీటీడీ చెల్లించాల్సిన ఆస్తి పన్నులు మాత్రం వసూలయ్యే పరిస్థితి లేదు.

**ఆస్తిపన్ను పెంపు ఆదాయం ఇలా..**

| | | | |
|---|---|---|---|
| తిరుపతి | రూ.18.25 కోట్లు | కర్నూలు | రూ.15.54 కోట్లు |
| కడప | రూ.11.21 కోట్లు | అనంతపురం | రూ.9.80కోట్లు |

### సర్వేలో లోపాలను గుర్తిస్తారట...

పన్ను విధింపులో క్షేత్రస్థాయిలో అవకతవకలు జరుగుతున్నాయని ప్రభుత్వానికి వస్తున్న ఫిర్యాదులపై ప్రక్షాళనకు పురపాలక, పట్టణాభివద్ధి శాఖ చర్యలు చేపటినట్లు పైకి చెబుతోంది.

- ఇళ్లు, భవనాలు ఉన్న వారు ఆస్తి పన్ను చెల్లిస్తు న్నారా? లేదా?
- నిర్మాణ విస్తీర్ణం మేరకే సిబ్బంది పన్ను విధించారా?
- అదనపు అంతస్తులకు పన్ను విధించారా?
-నివాస భవనాలను వాణిజ్య అవసరాలకు విని యోగిస్తున్నారా?

### కమిషనర్ల నుంచి స్వీయ ధ్రువీకరణ...

ఇంటింటి సర్వే నెల రోజుల్లో పూర్తిచేసి వచ్చేనెల 15 నాటికి లోపాలను సవరించాలి. తమ పరిధిలో పన్ను మదింపు చేయాల్సిన ఆస్తులేవీ లేనట్లుగా కమిషనర్లు రాష్ట్ర పురపాలక శాఖకు స్వీయ ధృవీకరణ పత్రాలను పంపాలి. దీనిపై రాష్ట్ర బృందాలు ఆకస్మిక తనిఖీ చేపడతాయి. అపుడు ఏవైనా లోపాలు బయట పడితే సంబంధిత కమిషనర్లను బాధ్యులను చేస్తారు.

### పన్నులు పెంచితే ఉద్యమిస్తాం

**వి.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి**

రాష్ట్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా ప్రజలపై ఆస్తి పన్నుల భారం మోపితే చూస్తూ ఊరుకునేది లేదు. తక్షణమే పెంపు యోచనను ఉపసంహరించుకోవాలి. ఇప్పటికే విద్యుత్ ఛార్జీలు నెలనెలా పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి. పెట్రోల్, డీజిల్‌తో పాటు రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచేశారు. ప్రజలను భారాల సుడిగుండంలోకి నెట్టొద్దు.

# 'అమ్మా..' ఆదుకోమ్మా..!

## తహశీల్దార్‌ను వేడుకొన్న వేణుగోపాల్ కాలనీ నిర్వాసితులు

**ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)**

గురువారం సాయంత్రం ఘటనా స్థలానికి చేరుకున్న తహశీల్దార్ భాగ్యలక్ష్మిని వేణుగోపాల్ కాలనీవాసులు చుట్టుముట్టారు. 'అమ్మా.. ఉంటానికి ఇల్లు లేదు.. కూల్చేశారు.. ఎండకూ, వానకూ తడుస్తూ ఉన్నాం.. పునరావాసం కల్పించి, ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి' అంటూ వేడుకొన్నారు. ఘటన జరిగిన తీరును బాధితులు, అఖిలపక్షం నేతలు వివరించారు. తహశీల్దార్ స్పందిస్తూ ఈ స్థలానికి సంబంధించి కోర్టులో వివాదం నడుస్తోందని, కోర్టులో కేసు నడుస్తున్న సమయంలో ఇలా కూల్చివేత జరగడం సమంజసం కాదన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా ఎటువంటి చర్యలు తీసుకోవాలో పరిశీలిస్తామని, వాస్తవ పరిస్థితులను కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ఇళ్లు కూల్చేయబడిన బాధితుల నుంచి రెవెన్యూ అధికారులు వారి డాక్యుమెంట్ల నకళ్లను తీసుకున్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని తహశీల్దార్ కారు వెంట నడుస్తూ బాధితులు వేడుకోవడం గమనార్హం. తహశీల్దార్ వెంట డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్‌నాయక్, ఆర్‌ఐ రామచంద్రయ్య, విఆర్‌ఒలు సతీష్, ప్రసాద్ పాల్గొన్నారు.

**కాలనీలను కూల్చడానికే ...**
**'కూటమి' ప్రభుత్వం ఉందా..? : అఖిలపక్షం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎన్నడూ చూడని ఘటనలు జరుగుతున్నాయని, మంగళం పరిధి తిరుమల నగర్

గ్రామపంచాయతీలో వేణుగోపాల కాలనీని రాత్రికి రాత్రి వందల మంది యువకులను కాలనీ పైకి పంపి దాదాపు 80 ఇళ్ళను నేలమట్టం చేయడం వెనుక ఉన్న కుట్ర దారులను పోలీసులు ఛేదించి, అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో అఖిలపక్ష నేతలు మాట్లాడారు. ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత కూడా జిల్లా కలెక్టర్ స్థాయికి ఈ సంఘటన వెళ్లలేదంటే క్షేత్రస్థాయిలో అధికారులందరూ కుమ్మక్కై ఇళ్ళ కూల్చివేత ఘటనకు కారణమయ్యారని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆరోపించారు. ఇళ్ల కూల్చివేత వెనుక మాజీ ఐఆర్ఎస్ అధికారి రాజన్‌బాబు, నిర్మల, రమణారెడ్డి, మునిరెడ్డి, మస్తాన్ ఉన్నారన్నారు. విలేకరుల సమావేశంలో ఆర్‌పిఐ అధ్యక్షులు అంజయ్య, నాయకులు వేణుగోపాల్, చిన్నం పెంచలయ్య, బుజ్జి, బాధితులు పాల్గొన్నారు.

ప్లాట్లు అమ్మిన రుద్రగోపిని నిలదీస్తూ...

**దేవాలయమే... శరణాలయమై...**

మంగళం పరిధి తిరుమల నగర్ గ్రామపంచాయతీ వేణుగోపాల్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి ఇళ్లను కూల్చివేయడంతో నిర్వాసితులకు నిలువ నీడలేకుండా పోయింది. ప్రస్తుతం వారు వినాయక స్వామి ఆలయంలోనే శరణార్థులుగా ఉన్నారు. పిల్లలను ఆలయంలో నిద్రపుచ్చుతూ, తమ ఇల్ల వద్ద ఆరుబయట ఆడిపించిన జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ వృద్ధులు కన్నీటి పర్యంతమవుతూ 'ప్రజాశక్తి'కి కనిపించారు.

దేవాలయంలో తలదాచుకున్న పేదలు

## భూపోరాట యోధుడు జక్కా వెంకయ్య

**ప్రజాశక్తి - గూడూరు టౌన్**

'అలుపెరుగని భూపోరాట యోధుడు జక్కా వెంకయ్య' అని వక్తలు ఉద్ఘాటించారు. గూడూరు సిపిఎం కార్యాలయంలో జక్కా వెంకయ్య ఏడో వర్ధంతి పురస్కరించుకుని ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ అధ్యక్షతన నివాళి అర్పించారు. నెల్లూరు జిల్లా ఉద్యమాన్ని ముందుండి నడిపించిన రథసారథి అని కొనియాడారు. బాబ్రీ మసీదు కూల్చివేత సందర్భంగా మతకలహాలు జిల్లాలో జరగకుండా నిరోధించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. యువతకు ఆయన ఆశయాలు, పోరాటాలు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టి.వెంకట రామిరెడ్డి, బివి రమణయ్య, ధారా కోటేశ్వరరావు, పామంజి మణి పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు మూడు నెలలు పొడిగింపు

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో మరో మూడు నెలల పాటు ఆగస్టు 31 వరకూ పొడిగిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ వెల్లడించారు. ప్రస్తుతం అక్రిడిటేషన్ ఉన్న వారికి జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకూ పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందన్నారు. జర్నలిస్టుల వివరాలను జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారికి అందజేయాలని పేర్కొన్నారు.

## జెవివి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎంఆర్‌పల్లి బాలల గ్రంథాలయంలో సమ్మర్‌క్యాంపు నిర్వహించి, విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసినట్లు జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప తెలిపారు. నెలరోజులుగా వినోదాత్మక, విజ్ఞానాత్మక, సృజనాత్మక కార్యక్రమాలను వేసవిలో నిర్వహించినట్లు తెలిపారు. ఇంగ్లీష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీష్, శాస్త్రీయ దృక్పధం విషయాలను నేర్పించారు. స్పోకెన్ ఇంగ్లీష్, ఈసోప్ కథలు, విశ్వావతారం నుంచి నరావతారం పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిర్లానాయుడు, రఫీ, లక్ష్మీనారాయణ, లైబ్రేరియన్స్ ధనంజయులు, గురుప్రసాద్ పాల్గొన్నారు.

## తెలుగుగంగ ఎస్ఈగా విజయ కుమార్‌రెడ్డి

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**

తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ఈగా పి.విజయ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. జలవనరుల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తున్న ఆయనకు ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఎస్ఈగా ఉద్యోగోన్నతి కల్పించింది. ఆ ఉద్యోగోన్నతిపై ఆయనను తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు, గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజె క్టుల సర్కిల్‌కు బదిలీ చేసింది.

## విజిలెన్స్ తనిఖీలు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

తొట్టంబేడు తహశీల్దారు కార్యాలయంలో గురువారం తిరుపతి విజిలెన్స్ విభాగం అధికారులు తనిఖీలు చేపట్టారు. 2021లో ఏసీబీకి చిక్కిన అప్పటి తొట్టంబేడు తహశీల్దార్ పరమేశ్వర స్వామి కేసు విషయమై తాము తనిఖీలకు వచ్చినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. తమకు అవసరమైన ఫైళ్లను తీసుకెళుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా అదే ఏడాది ఆత్మహత్య చేసుకుని మతి చెందిన కంప్యూటర్ ఆపరేటర్ దుర్గాప్రసాద్ మతిపైనా తాము సిబ్బందిని విచారించినట్లు వివరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ మల్లికార్జున్, సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేట హోటల్లో జంట ఆత్మహత్య

**ప్రజాశక్తి - నాయుడుపేట**

తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న హోటల్ అమరావతిలో ఒక జంట ఆత్మహత్యకు పాల్పడింది. దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డి పాలెం గ్రామానికి చెందిన జమ్మల సుబ్రహ్మణ్యం, అదే గ్రామానికి చెందిన దేవత శిరీష గురువారం మధ్యాహ్నం సుమారు ఒంటిగంట సమయంలో హోటల్ గదిలో ఆత్మహత్య పాల్పడినట్టు పోలీసులు తెలియజేశారు. సుబ్రహ్మణ్యం గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడగా, శిరీష ఉరేసుకుంది. వివాహేతర సంబంధమే కారణమని తెలుస్తోంది. వీరిద్దరి విషయం ఊళ్లో తెలిసి, గొడవలు జరిగిన నేపథ్యంలో వీరిద్దరూ ఆత్మహత్య చేసుకుని ఉంటారని సమాచారం. మృతదేహాలను నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తామని సిఐ బాబీ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# అడ్మిషన్లు.. కమీషన్లు..!

ఒక స్టూడెంట్‌ను చేరిస్తే రూ.4వేలు
ప్రతి గుమ్మం ఎక్కుతున్న టీచర్లు
పుట్టగొడుగుల్లా ప్రైవేట్ పాఠశాలలు
భారీస్థాయిలో ఫీజులు వసూలు
నిబంధనలు పూర్తిగా కనుమరుగు

**ప్రజాశక్తి - కోట**

**ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.. దీంతో అడ్మిషన్లు సైతం రోడ్డెక్కాయి.. వేసవి సెలవులు ప్రకటించారే తప్ప, ప్రైవేట్ స్కూళ్ల ఉపాధ్యాయులకు అడ్మిషన్ల ఒత్తిడి తప్పలేదు. ఒక్కో ఉపాధ్యాయుడు ఖచ్చితంగా ఇన్ని అడ్మిషన్లు చేసి తీరాల్సిందేనంటూ కరస్పాండెంట్ల హుకుం. అడ్మిషన్లకూ 'కమీషన్ల' ఆశ. ఒక్కో అడ్మిషన్‌కు ఒక్కో బహుమానం. ఇదీ కరస్పాండెంట్ల గాలం. ఒక విద్యార్థిని చేరిస్తే రూ.3,500-4వేల వరకూ కమీషన్ ఇస్తున్నట్లు సమాచారం. ఒక విద్యార్థి చేరితే తమకు వచ్చే లాభాలను బేరీజు వేసుకుని అడ్మిషన్లకు 'కమీషన్ల' కథ నడుస్తోంది. 'మా స్కూలు కార్పొరేట్, మా స్కూల్లో ఇంగ్లీష్ మీడియం, నీట్, ఎంసెట్, టెక్' అంటూ గొప్పలు చెప్పుకుంటూ ప్రైవేట్ టీచర్లు రోడ్లమ్మట తిరుగుతూ, ప్రతి గుమ్మం ఎక్కి దిగుతూ విద్యార్థుల అడ్మిషన్లకు గాలం వేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని విద్యార్థులు వీరి టార్గెట్. ప్రస్తుతం 'గూడలి' వద్ద ఓ స్కూలును నూతనంగా ప్రారంభించి అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఎన్ని స్కూళ్లకు అనుమతులు ఉన్నాయో, ఎన్ని స్కూళ్లకు లేవో విద్యాశాఖాధికారులకే ఎరుక.**

కోట మండలంలో ఐదు ఇంగ్లీష్ మీడియం స్కూళ్లు ఉన్నాయి. పోటాపోటీ ప్రచారాలతో అడ్మిషన్లు జరుగుతున్నాయి.

రోడ్డుపైనే ప్రైవేట్ స్కూళ్ల అడ్మిషన్ల వ్యవహారం

పాఠశాల యాజమాన్యాలు నిర్ణయించిన ఫీజుల ప్రకారం చెల్లించి పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్పిస్తున్నా 'బోధన' అంతంతమాత్రంగానే ఉందన్న విమర్శలు లేకపోలేదు. ఇంటర్, డిగ్రీ ఫెయిలైన ఆంగ్లంలో ప్రావీణ్యం లేని వారిని ఉపాధ్యాయులుగా నియమించుకుని తక్కువ జీతాలిస్తూ, ఫీజులు మాత్రం భారీగా వసూలు చేస్తున్నారు. పేరుకు మాత్రమే కార్పొరేట్, ఇంగ్లీష్ మీడియం స్కూళ్లు. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడే నైపుణ్యం రోజురోజుకూ దిగజారిపోతోంది. కొన్ని సంవత్సరాల క్రితం కోట మండలంలో ఇంగ్లీస్ మీడియం స్కూల్లో కొద్దోగొప్పో ఇంగ్లీష్ మాట్లాడాలనే నిబంధన విధించేవారు. రానురాను 'లాంగ్వేజ్' సబ్జెక్టుల్లో నాణ్యత నాశిరకంగా ఉంటోంది.. కొంతమంది విద్యార్థులకైతే తెలుగు రాస్తే 'బండబూతులు'. అటు తెలుగు రాక, ఇటు ఇంగ్లీష్ మాట్లాడలేకపోతున్నారన్నది తల్లిదండ్రుల ఆవేదన. కమ్యూనికేషన్ స్కిల్స్ పూర్తిగా కనుమరుగు. ఇక విద్యార్థుల పుస్తకాల విషయంలో వేల రూపాయలు వసూలు చేస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 'సెక్షన్ల' పేరుతో విద్యార్థులను విభజిస్తూ, వారిలో ఉన్న ఆసక్తిని దిగజార్చి ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ పరిస్థితులను పాఠశాల యాజమాన్యం సృష్టిస్తోంది. చదివే విద్యార్థులు ఒక సెక్షన్, చదవని వారు మరో సెక్షన్ అంటూ విద్యార్థుల మధ్య విభజన చేస్తోంది. కరస్పాండెంట్లు విద్యాలయాల్లో లాభాలను చూసుకుంటున్నారే తప్ప, ఈ సెక్షన్ల విభజన వల్ల విద్యార్థుల్లో మానసిక సంఘర్షణను అర్థం చేసుకోలేని పరిస్థితి. ఇదంతా ఒక ఎత్తయితే స్కూల్లో చేరినప్పటి నుంచి ఫీజులు కట్టించడమే కాకుండా, దానికీ,దీనికి అంటూ డబ్బులు వసూలు చేస్తానే ఉంటారు. ఫీజులు భారీగా, బోధన నాశిరకంగా ఉంటోందని కొంతమంది తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రైవేట్ విద్యాలయాలపై అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా ఉండటమే కారణమని తెలుస్తోంది.

# పుస్తకం విలువ అపారం

'ప్రజాశక్తి'తో సప్తగిరి ఎడిటర్ రాధారమణ

**ప్రజాశక్తి -తిరుపతి సిటి**

'ధర్మో రక్షితి రక్షిత్త అన్నారు పెద్దలు. ధర్మాన్ని మనం రక్షిస్తే, ఆ ధర్మం మనల్ని, సమాజాన్ని రక్షిస్తుంది' అని సప్తగిరి మాస పత్రిక ప్రధాన సంపాదకులు డాక్టర్ కోటపాటి రాధారమణ అన్నారు. అక్షరానికి, పుస్తకానికి ఉన్న విలువ అపారమైనదని చెప్పారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ నేపథ్యంలో ఆయన 'ప్రజాశక్తి'తో తన అనుభవాలను పంచుకున్నారు. ఆయన మాటల్లోనే..

ధర్మరక్షణలో ప్రధాన భాగం ధర్మ ప్రచారం. ధర్మాన్ని, సంస్కృతిని, సంస్కారాన్ని మన ముందు తరాలవారు మనకు అందించారు. మనం మన తర్వాతి తరానికి అందించాలి. అక్షరానికి, పుస్తకానికి ఉన్న విలువ అపారమైనది. సామాన్య పాఠకుడికి సైతం హైంధవధర్మం, శ్రీవారి వైభవం అర్థమయ్యేలా ఆధ్యాత్మిక మాసపత్రిక 'సప్తగిరి'ని తీర్చి దిద్దడంలో నా వంతుకషి చేశాను. నా ముందుతరం వారు నాకు అందించిన సత్సంప్రదాయాన్ని నేను నిలిపానని నమ్ముతున్నాను. తిరుమల తిరుపతి దేవస్థానం విస్తతంగా ఆధ్యాత్మిక సాహితీసేవ చేయాలనే సదాశయంలో 'సప్తగిరి' మాస పత్రికను 1949లో బులెటిన్‌గా ప్రారంభించింది. ఇది అంచెలంచెలుగా ఎదిగి, అనేక రూపాంతరాలు చెంది 2014 నాటికి ఆరు భాషల (తెలుగు, తమిళం, కన్నడం, ఇంగ్లీషు, హిందీ, సంస్కృతం)లో ప్రచురితమౌతూ, 2016లో పూర్తి రంగులలో రావడం ప్రారంభమైంది. సనాతన ధర్మప్రచారంలో ముందుకు సాగుతున్నది. ఈ 'సప్తగిరి' మాసపత్రికకు నేను ఉపసంపాదకుడిగా 1993, జూలై నెలలో మొట్టమొదట ఉద్యోగంలో చేరాను. అప్పటికే నేను 'యోగా' బోధకుడిగా టిటిడిలో ఉన్నాను. అక్కడి నుంచి 'సప్తగిరి' కార్యాలయానికి ఉపసంపాదకుడిగా వచ్చాను. నాకు అప్పగించిన పనుల్ని ఏవిధమైన పొరబాటు లేకుండా నిబద్ధతలో చేసుకుంటూ పోయాను. నేను 2010 ఫిబ్రవరిలో 'సప్తగిరి' మాసపత్రికకు సంపాదకుడిగా ఉద్యోగోన్నతి పొందాను. డాక్టర్ సి.శైలకుమార్ ప్రధాన సంపాదకత్వంతో 'సప్తగిరి' పత్రిక స్వర్ణ యుగాన్ని చవిచూసింది. మేమిద్దరం కష్ణార్జునుల్లా పత్రికను పాఠకలోకానికి మరింత చేరువ చేశాం. పత్రికతో పాటు, తితిదే ప్రచురణల విభాగం కూడా మా కార్యాలయ పరిధిలోనే ఉండేది. తితిదే సవ్యాఖ్యాన కవిత్రయ మహాభారతాన్ని ముద్రించడం మాకు ఆత్మసంతప్తిని కలిగించిన సంఘటనాంశం. అలాగే పోతన భాగవతం వ్యాఖ్యాన ప్రాజెక్టును ప్రారంభించడం, 2014లో ఒక సంస్కతభాషలో 'సప్తగిరి' మాసపత్రికను ప్రారంభించడం, 40 వేల ప్రతుల నుంచి సుమారు రెండులక్షలకు సప్తగిరి అమ్మకాలు పెంచడం, ఇంకా గోదావరి, కష్ణ పుష్కరాల్లో ప్రత్యేక సంచికలు ప్రచురించడం.. ఇలా ఎన్నో మంచిపనులు 'సప్తగిరి' సంపాదకుడిగా చేశాను. హిందూధర్మప్రచార వ్యాప్తికి కషి చేశాము. 2016, జూలైలో తితిదే ప్రధాన సంపాదకుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అంకితభావంతో పనిచేశాను. నేను ప్రధాన సంపాదకుడిగా సప్తగిరి మాసపత్రికను



నాకు చేతనైనంతలో అభివద్ధిపథంలో నడిపించాను. సప్తగిరి మాసపత్రికను అన్నివర్గాల పాఠకులకు వినూత్న శీర్షికల ద్వారా అత్యంత చేరువ చేయగలిగాను. బాలలకోసం 'బాలసప్తగిరి' అనుబంధపత్రికను వెలువరింపచేశాను. పిల్లలకోసం చిత్రకథ అనే ప్రత్యేకశీర్షికను ప్రారంభించాను. 34 సంవత్సరాల పాటు తితిదేలో అనేక పదవులు నిర్వహించడం, 'ఉత్తమ ఉద్యోగి' అవార్డును అందుకోవడం నా పూర్వజన్మ సుకతం. నా తల్లిదండ్రులు చేసుకున్న పుణ్యంగానే భావిస్తాను తప్ప నా ఘనత కాదు. ఇన్నేళ్లు నేనేదైనా చేయగలిగానంటే కేవలం నా ఒక్కడి కషి కాదు, నా సహచర ఉద్యోగులందరూ అందించిన సహకారం, ఉన్నతాధికారులు అందించిన నిరంతర ప్రోత్సాహం. విద్య, ఉద్యోగం, వివాహం తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో జరగడం శ్రీవారి కపే. ఎన్నో ఆటుపోట్లు, మరెన్నో ఇబ్బందులు శాఖాపరంగా వచ్చినా, శ్రీవారి కపతో వివాదరహితంగా ఇన్నేళ్లూ స్వామి సేవలో పనిచేసి, తరించి, స్వామివారు జీతం రూపంలో ఇచ్చిన ప్రసాదాన్ని స్వీకరించి నన్ను, నా కుటుంబాన్ని వద్ధి చేసుకోగలిగాను. ఆత్మ సంతప్తితో ఉద్యోగ విరమణ చేస్తున్నాను. అందరికీ నా కతజ్ఞతలు. వినమ్ర ప్రణామాలు

## రేపు ఎన్టీఆర్ భరోసా

### సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీకి రంగం సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను అందివ్వాలని డిఎల్డిఓలను, మున్సిపల్ అధికారులను, ఎంపీడీవోలను ఆదేశించారు. తిరుపతి జిల్లాకు సంబంధించి 2,60,379 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.117.04 కోట్ల రూపాయలను విడుదల చేయడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు.

**స్పౌస్(వితంతు) పింఛన్లు మంజూరు**

రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను పొందుతూ మరణించిన భర్త పింఛనును అతని భార్యకు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు సెర్ప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కరుణ వాకాటి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 71, 380 స్పౌస్(వితంతు) పింఛన్లను మంజూరు చేశారు. తిరుపతి జిల్లాలో 2997 మంది ఈ స్పౌస్(వితంతు) పింఛన్లు పొందేందుకు అర్హులుగా గుర్తించారు. వీరికి జూన్ 12వ తేదీన రూ.4000 రూపాయలను ఆయా సచివాలయాల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు అందించాలని సూచించారు.

## 'యోగాంధ్ర'లో భాగస్వామ్యం కావాలి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

యోగా దైనందిన జీవితంలో భాగం కావాలని, అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు అన్నారు. గురువారం ఉదయం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఎస్వీ జూపార్కులో యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగాసనాలు చేశారు. జేసీ శుభం బన్సల్, జూక్యూరేటర్ సెల్వం, డిఎఫ్ఒ వివేక్ పాల్గొన్నారు.

## జక్కా వెంకయ్యకు ఘన నివాళి

జక్కా వెంకయ్యకు నివాళి అర్పిస్తున్న శివకవి ముకుంద

**ప్రజాశక్తి - నాయుడుపేట:** నాయుడు పేట, వేదనపర్తి సుందర్ రామిరెడ్డి భవన్ సిపిఐయం కార్యాలయంలో సిపిఎం నాయకులు జక్కా వెంకయ్య ఏడవ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయుడుపేట సిపిఎం నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ మార్క్సిస్ట్ ఉద్యమ నిర్మాత, పీడిత ప్రజల ఆశాజ్యోతి తమ ప్రియతమ నాయకుడు జక్కా వెంకయ్య పేద ప్రజలకు ఆరాధ్యుడని ఆయన భౌతికంగా మన మధ్య లేనప్పటికీ ప్రతి పేద వాడి గుండెల్లో స్థిరంగా నిలిచి ఉంటాడని అన్నారు.

## మహానాడు సభకు తరలిన నాయకులు

**ప్రజాశక్తి - నాయుడుపేట:** కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం ఉదయం నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు నాయకులు నాయుడుపేట నుండి కడపకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట పట్టణ టీడీపీ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, మాజీ జడ్పిటిసి సభ్యులు పేరంకెట్టి శ్రీరాం ప్రసాద్, డాక్టర్ దారా అంకయ్య, నెలవల రాజేష్, అవధానం సుధీర్, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి శ్రీకాళహస్తి నియోజకవర్గం నుండి గురువారం టిడిపి కార్యకర్తలు తరలి వెళ్లారు. తొట్టంబేడు మండలంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు రావిళ్ల మునిరాజా నాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలు కడపకు తరలారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం, చంద్రయ్య నాయుడు, భాస్కర్ నాయుడు, చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** శుక్రవారం మహానాడు సభల మూడవ రోజు మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో 100 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు సభకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కాశీ బాబు, శ్రీనివాసులు, మురళి, శ్రీను రెడ్డి, బాబు నాయుడు, హరి, విజయ నాయుడు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-కోట :** కడపలో నిర్వహిస్తున్న టీడీపీ మహానాడు కార్యక్రమంలో పాల్గొనడానికి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు డీసీసీబీ బ్యాంక్ మాజీ చైర్మన్, కోటమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ టిడిపి నాయకులు, కోట మండల అధ్యక్షులు మద్దాలి సర్వోత్తమ రెడ్డి, జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్ బాబుల నాయకత్వంలో కొత్తపట్నం, సిద్ధవరం పంచాయితీ ఇజ్జలూరు పాడు గ్రామం, కర్లపూడి, ఉత్తమనెల్లూరు గ్రామాల నుండి టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమూరు మురళి, తిరుపతి పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇన్నమూరి అనోక్, జరుగుమల్లి కోటేశ్వరరావు, సిద్ధవరం పంచాయతీ నాయకులు, జనసేన నాయకులు కావాలి అనోక్‌లు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:** కడప జరుగుతున్న మహానాడు బహిరంగ సభకు నగరి నియోజకవర్గం నుండి పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో, రూరల్, విజయపురం నిండ్ర నగరి వడమాల పేట మండలాల నుంచి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు, టిడిపి అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ ధనపాల్, రూరల్ పార్టీ అధ్యక్షులు బాలాజీ, నెడవేటలు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కడపకు తరలివెళ్లారు.

**ప్రజాశక్తి - ఏర్పేడు :** కడపలో జరుగుతున్న మహానాడుకు మడిబాక, రాజుల కండ్రిగ, కోబాక, ఏర్పేడు, పాపానాయుడు పేట, మొదుగులపాలెం, చిందేపల్లి, జంగాలపల్లి, వంగారు, పల్లాం తదితర గ్రామాల నుండి మండల టిడిపి అధ్యక్షులు పేరం నాగరాజు నాయుడు పర్యవేక్షణలో మండల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కడపకు తరలి వెళ్లారు.

## హైవే పనులు పూర్తి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** తిరుపతి బైపాస్‌లో ఎన్‌హెచ్-205 పై అదనపు 3-లేన్ రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తయిందని నేషనల్ హైవే అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బ్రిడ్జ్ పూర్తవడంతో చెన్నై-తిరుపతి, నాయుడుపేట-పీలేరు విభాగాల మధ్య అనుసంధానం మెరుగుపడిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ఎస్ఎవిఎ అధికారులు, రైల్వే అధికారుల చొరవతో ఈ పూర్తయ్యిందని తెలిపారు. తిరుపతి జాతీయ రహదారి ఎన్‌హెచ్ 205 పై కిలోమీటర్ 293/155 వద్ద, పూడి, రేణిగుంట స్టేషన్ల మధ్య రైల్వే లైను దాటడం 3-లేన్ రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తయ్యిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా నిర్మించిన బ్రిడ్జి, రేణిగుంట-చెన్నై విభాగాన్ని కిలోమీటర్ 132/16-18 వద్ద అనుసంధానిస్తుందని. ఇప్పుడు వాహనాల ట్రాఫిక్ సమస్య పరిష్కారమైందని తెలిపారు. కొత్తగా పూర్తయిన 3-లేన్ ఆర్‌ఓబి ఈ వేగంగా, ట్రి-ఫ్రో రవాణాను నిర్ధారించి ఈ హైవే విభాగంపై ట్రాఫిక్ జామ్‌ను తొలగించడానికి, ప్రయాణికులకు, సరుకు రవాణాకు సజావుగా మార్గాన్ని అందిస్తుందని ఆ ప్రకటనలో తెలిపారు.

## ఎండీయు వాహనాలను కొనసాగించాలి

**కందారపు మురళి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి**



**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** ప్రజా పంపిణీ వ్యవస్థలో వినియోగదారులకు ఇంటికే నేరుగా సరుకులు సరఫరా చేస్తున్న మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ల (ఎం.డి.యు)లను జూన్ 1 నుండి నిలిపివేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించి ఆపరేటర్లు, అసిస్టెంట్లను కొనసాగించాలని సిఐటియు నాయకులు కందారపు మురళి సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. గత 4 సంవత్సరాలుగా రాష్ట్రంలో 9,260 మొబైల్ వాహనాల ద్వారా కోట్లాది మంది లబ్ధిదారులకు ఇంటికే సరుకులు చేరవేస్తున్నారు. ఈ వాహనాలపై ఆధారపడి ఆపరేటర్లు, అసిస్టెంట్లు 18,520 మంది జీవన భృతి పొందుతున్నారని తెలిపారు. ఒక్కో వెహికల్ ను రూ.5.75 లక్షలకు బ్యాంకు నుండి ప్రభుత్వం ఆపరేటరుకు లోన్ క్రింద ఇప్పించిందని తెలిపారు. ప్రతినెలా ఆపరేటర్లు రూ.3 వేలు ఈఎంఐ క్రింద చెల్లిస్తున్నారన్నారు. వీరి సేవల మూలంగా లబ్ధిదారులు, డీలర్లు షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన అవసరం లేకుండా పోయిందని తెలిపారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఉపాధి కోల్పోకుండా వారికి మొబైల్ వ్యవస్థ తోడ్పడిందన్నారు. వృద్ధులు, వికలాంగులకు ఏజెన్సీ ప్రాంతాల్లో ఎంతో ఉపయోగకరంగా ఈ వ్యవస్థ ఉందని తెలిపారు. ఇటువంటి వ్యవస్థను మే 1న జరిగిన మంత్రివర్గ సమావేశంలో జూన్ 1 నుండి రద్దు చేసి, డీలర్ వ్యవస్థను పునరుద్ధరించాలని తీర్మానించడంతో 18,520 మంది వీధిపాలయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎం.డి.యు వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## పుత్తూరులో యోగా పోటీలు

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** పట్టణంలోని వార్డు సచివాలయాల పరిధిలో యోగాపై పోటీలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 వ తేదీ నుండి జూన్ 21 వ తేదీ వరకు యోగాంధ్ర నిర్వహిస్తున్నారు. గురువారం పుత్తూరు పురపాలక పరిధిలో వున్న సచివాలయాల్లో యోగా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీ లపై యోగా శిక్షకులచే విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు.

## ఉగ్రవాద నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** ఉగ్రవాద నిర్మూలనకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, మతసామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ కోరుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సి.పి.ఎం పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న సమైక్యత యాత్రలలో భాగంగా తిరుపతి జిల్లా, గూడూరులో గురువారం సి.పి.ఎం పార్టీ ఆధ్వర్యంలో సి.పి.ఎం పార్టీ కార్యాలయం నుండి సమైక్యతా యాత్ర ప్రారంభించారు. వివేకానంద రోడ్డు, ముత్యాల పేట, మీదుగా పాత బస్టాండు, టవర్ క్లాక్ సెంటర్, ఎన్టీఆర్ కాంప్లెక్స్, గాంధీ మున్సిపల్ కార్యాలయం మీదుగా దుకాణ దారులకు, ప్రయాణికులకు, ప్రజలకు, కరపత్రాలను అందజేస్తూ కొనసాగింది. ఈ ప్రదర్శనలో ఉగ్రవాదులు, మతోన్మాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్, పెహల్గామ్‌లో 26 మంది పర్యాటకులను హతమార్చిన ఉగ్ర దాడిని ఖండిస్తూ సమైక్యత యాత్రను ప్రారంభించామన్నారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో యుద్ధం ప్రకటించి, ఉగ్రవాదులను అంతమొందించామని, ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని చెబుతున్నారని, ఇప్పటివరకు ఉగ్రవాదులు ఎక్కడ నుండి వచ్చారు? ఎంతమందిని పట్టుకున్నారో ప్రజలకు తెలియజేయాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ముందుకు వచ్చి దేశ ప్రధానికి ఉగ్రవాదులను అణచివేయించేందుకు కలిసికట్టుగా ఉంటాం అని చెప్పడం జరిగిందని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేస్తే యుద్ధం ఆగిపోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి వివరాలు దేశ ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, నాయకులు బి.వి రమణయ్య, టి.వెంకటరామిరెడ్డి, పామంజి మణి, ప్రసాద్, గండికోట మధు, ధారా కోటేశ్వరరావు, ఎస్కె మహబూబ్ బాషా, వై.సుబ్రహ్మణ్యం, ఆర్.శ్రీనివాసులు, బి.నారాయణ, వెంకటప్పయ్య, బి.చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల్లో సమైక్యతను పెంపొందించాలి..

**ప్రజాశక్తి - నాయుడుపేట:** నాయుడుపేట మున్సిపాలిటీ, చంద్రబాబు నాయుడు కాలనీలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సమైక్యతను పెంపొందించాలి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ పాకిస్తాన్‌తో ఘర్షణ నేపథ్యంలో జరిగిన ఒప్పందాలను దేశ ప్రజలకు వివరించాలన్నారు. ఉగ్రవాద నిర్మూలనకు దేశ ప్రజలలో సమైక్యతను పెంపొందించాలని సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రదాడులకు మతం రంగు పులమడం సరైనది కాదన్నారు. పెహల్గాం దాడులకు పాల్పడిన తీవ్రవాదులను నేటికీ పట్టుకోకపోవడం ప్రభుత్వ వైఫల్యం అన్నారు. యుద్ధం వల్ల సాధించిన ఫలితాలను వివరించాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు సమావేశాలు నిర్వహించి వివరాలు బహిర్గతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు కుమార్, ఎస్.కె అబ్దుల్లా, ఎస్కే.దిలీప్, ముత్యాలయ్య, వేణు తదితరులు పాల్గొన్నారు.

## స్థలాలు కేటాయించాలి

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** గుజిరి వ్యాపారస్తులకు స్థలాలు కేటాయించాలని పుత్తూరు డివిజన్ నూతన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక పుత్తూరు గోవిందపాలెం బైపాస్ వద్ద గురువారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి సర్దార్ శివ, గుజిరి సంఘం జిల్లా కన్వీనర్ అల్లాబక్ష్, పుత్తూరు డివిజన్ నాయకులు మహేష్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్‌కు సహకరిస్తున్న గుజిరీలపై దొంగతనాల ఆరోపణలు చేయడం దారుణమన్నారు. గుజిరి వ్యాపారుల సంఘం తిరుపతి జిల్లా మొదటి మహాసభ జూన్ 20 తేదీన తిరుపతిలో జరుగనుందని తెలిపారు. సంఘం నూతన సమితి గౌరవ అధ్యక్షులుగా మహేష్‌ను, అధ్యక్షులుగా శివకుమార్‌ను, ప్రధాన కార్యదర్శిగా దావత్ బాయ్‌ని, కోశాధికారిగా పెరుమాళ్‌ను, ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తిని, సహాయ కార్యదర్శిగా ఆర్ముగంను, కమిటీ సభ్యులుగా రాము, శ్రీరాములు, దాము, సురేంద్ర, అన్నామలై, యేసులను ఎన్నుకున్నారు.

## లైసెన్స్ ఉన్న డీలర్లు మాత్రమే రేషన్ పంపిణీ చేయాలి

**ప్రజాశక్తి - రామచంద్రాపురం:** రాష్ట్ర ప్రభుత్వం ఎమ్‌డియు వాహనాలను రద్దు చేసిన నేపథ్యంలో ప్రతినెల ఒకటవ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా డీలర్లు, లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను అందించాలని తహశీల్దార్ వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం తహసిల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ మాట్లాడుతూ రేషన్ పంపిణీలో సమయ పాలన ఉండాలన్నారు. అవకతవకలు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అన్వర్ భాష, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ యుగంధర్, ఆర్ఐ లక్ష్మీనారాయణ, మండల రేషన్ షాప్ డీలర్లు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని 28 పంచాయతీల డీలర్లతో గురువారం తహశీల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ శ్రీదేవి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తాసిల్దార్ శ్రీదేవి మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్ సరుకులను వాహనాల ద్వారా పంచాయతీలు వీధి వీధికి వెళ్లి లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందించడం జరిగేదని, ఆ విధానంలో లోటు పాట్లను గమనించిన ప్రస్తుత ప్రస్తు ప్రభుత్వం రేషన్ వాహనాలను రద్దుచేసి, డీలర్లకే సరుకుల పంపిణీ బాధ్యత అప్పగించిందని తెలిపారు. రేషన్ పంపిణీలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వీధి వ్యాపారుల సమగ్ర సర్వే నిర్వహించాలి

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** మున్సిపాలిటీలో వీధి వ్యాపారుల ఆర్థిక స్థితిగతులపై సర్వే నిర్వహించడంలో అధికారులు వైఫల్యం చెందారని వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ పేర్కొన్నారు. సర్వేను వేగవంతం చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. వీధి వ్యాపారుల సంఘం అధ్యక్షులు నజీర్ భాష, అల్లాబక్షు నాయకులు మహేష్‌లు మాట్లాడుతూ ఫీల్డ్ లెవల్లో పరిశీలించి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరామన్నారు. ఈ కార్యక్రమంలో వీధి వ్యాపారులు, బాషా, శివకుమార్, దావుద్ తదితరులు పాల్గొన్నారు.

## 31న సమైక్యతా ర్యాలీని జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** దేశ సమగ్రతను కాపాడుకునేందుకు ఈ నెల 31వ తేదీన వామపక్ష పార్టీలు, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ, ప్రజా సంఘాలు చేపట్టనున్న సమైక్యతా ర్యాలీని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో గురువారం సమైక్యతా ర్యాలీ కరపత్రాలను, గోడపత్రికలను ఆవిష్కరించారు. ఉగ్రవాదం నశించాలి.. మతోన్మాదాన్ని పారదోలాలి.. దేశ సమగ్రతను కాపాడుకోవాలి అన్న నినాదంతో పట్టణ నాలుగు మాడ వీధుల్లో భారీ ర్యాలీ ఉంటుందని తెలిపారు. పాస్టర్ సుందరరాజు, పాస్టర్ ఆంబ్రోస్, లాల్ బాషా, మీర్జావలి, అన్వర్ బాషా, సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారిన తెలుగు గంగ.. తీరిన రైతుల బెంగ



**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** గత ఏడాది అకాలవర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు ఈఏడాది కూడా అదే పరిస్థితి నెలకొంటుందనుకున్నారు. అయితే కండలేరులో నీరు సమృద్ధిగా ఉండడంతో అందరికీ రైతులకు నీరందించే తెలుగుగంగ కాలువలో నీళ్ళు నిండుగా ప్రవహిస్తూ కాలువ కళ కళలాడుతోంది. ఈనేపథ్యంలో అన్నదాతల పంటలకు ఊపిరి వచ్చినట్లు అనిపిస్తోంది. పంటలు చేతికి వస్తాయా? లేదా? అనుకుంటున్న తరుణంలో గంగ కాలువలో నీటిని విడుదల చేయడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్ళు గంగ కాలువలో నీటి కోసం నిరీక్షిస్తున్న రైతన్నలకు ఒక్కసారిగా కండలేరు నుంచి గంగ కాలువకు 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం మంచి పరిణామం. మంత్రులు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంగ కాలువలో నీటిని విడుదల చేశామని ఈఈ రత్నాకర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగ కాలువలో ప్రస్తుతం 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, అయితే ప్రస్తుతం చెన్నైకు మాత్రం 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని తెలిపారు. పంటలకు ఇంకా నీటిని విడుదల చేయలేదని గత జనవరిలోనే వర్షాలు ఎక్కువగా పడడంతో చెరువులు నిండడం వల్ల, నీటిని కొరత లేదని చెన్నైకు నీరు ఇచ్చిన తర్వాత గ్రామాల్లోని చెరువులకు నీటిని విడుదల చేస్తామన్నారు. ఏడో బ్రాంచి కాలువకు కూడా 250 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నామన్నారు. తిరుపతి తాగునీటికోసం ప్రతిరోజు 60 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నామని, శ్రీకాళహస్తి సమ్మర్ స్టోరేజి ట్యాంకుకు కూడా 25 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా తాగునీటి అవసరాల కోసం నీరు వాడుకోవాలన్నారు. తాగునీటి అవసరాలు తీరిన తర్వాత, చెరువులకు రెండో పంటకు నీరు అందిస్తామని తెలిపారు. గంగ కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ఎవ్వరు నీటిలో దిగి స్నానం చేయడం, గట్టుపై దుస్తులు ఉతకడం చేయరాదని హెచ్చరించారు. ఖరీఫ్ పంటకు రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు లేవని వ్యవసాయశాఖ సంచాలకులు తెలిపారు.

## యోగాతో మానసిక ప్రశాంతత

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** యోగాతో మానసిక రోగాలు మాయమై, మనిషి ఆరోగ్యంగా మెరుగుపడతాడని ఎస్.బి.ఆర్ పురం గ్రామ సర్పంచ్ ఆర్.మణి రాజు పేర్కొన్నారు. వడమాల పేట మండలం, ఎస్‌బిఆర్ పురం గ్రామ పంచాయతీలో ఐదు రోజులపాటు సర్పంచ్, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ:** యోగాతో ఒత్తిడి తగ్గించుకో వచ్చని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ తెలిపారు. మండలంలోని పల్లమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. బుచ్చినా యుడు కండ్రిగ మండలం, సచివాలయాల క్లస్టర్కు సంబంధించి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**ప్రజాశక్తి - రామచంద్రాపురం:** మానవుని ఆరోగ్యకర జీవితానికి యోగ అనుకరణీయమైన సాధనమని యోగా కేంద్రం డైరెక్టర్ ఈశ్వరయ్య అన్నారు. రామచంద్రాపురం మండలంలోని సి రామాపురంలో ఉన్న వెరిటాస్ సైనిక పాఠశాల ఆవరణలో రోజు వారి శిబిరంతో పాటుగా, సాధారణ కార్యకలాపాల శ్రేణి, "యోగా కనెక్ట్" పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ఎన్‌సిసి క్యాడెట్‌లు యోగా ప్రాణాయామం సెషన్‌లలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్లు సులోచన దేవి, రామ్మూర్తి,కె శ్రీనివాసులు కార్యాలయ పర్యవేక్షకులు పి సురేష్ కుమార్, క్యాంపు పరివేషకులు గుణశేఖర్, ఏఎన్‌ఓలు ఎన్‌సిసి కేడెట్లు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి -ఏర్పేడు :** మానసిక, శారీరకారోగ్యానికి యోగా అసరమని ఏర్పేడు మండల విద్యాశాఖాధికారి2 దయాకర్ తెలియజేశారు. జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, ఏర్పేడులో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్, వాణి, నచ్చనేరి పంచాయితీ కార్యదర్శి వెంకట ముని, సచివాలయ సిబ్బంది, సిఆర్పీలు మునీశ్వర్, వెంకటముని పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించండి

**ప్రజాశక్తి-వెంకటగిరి టౌన్ :** వెంకటగిరి మున్సిపాలిటీలో మున్సిపల్ కార్మికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వెంకటగిరి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌కి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల గురించి శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు వేధింపులు గురించి వెంకటగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏవి రమణ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్బయ్య, పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, శేఖర్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## హ్యాండీక్రాఫ్ట్ హబ్‌గా మాధవమాల : కలెక్టర్ వెంకటేశ్వర్

**ప్రజాశక్తి -ఏర్పేడు :** ఏర్పేడు మండలం, మాధవ మాలలో హస్త కళల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం సందర్శించారు. చెక్క బొమ్మల తయారీ హస్తకలలను, కలంకారి వారు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. శ్రీ బాలాజీ వుడ్ కార్వింగ్ ఆర్టిజన్ మ్యూచువల్ ఏఇడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారి ద్వారా వారికి కావలసిన సదుపాయాలపై చర్చించారు. ప్రభుత్వ పరంగా అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. తిరుపతి జిల్లాలో హ్యాండీ క్రాఫ్ట్ హబ్‌గా మాధవ మాలలో జరుగుతున్న కళలకు దేశ, రాష్ట్ర స్థాయి గుర్తింపు ఉందన్నారు. హస్తకళల కళాకారులను ప్రోత్సహించే విధంగా టీటీడీ, బ్యాంకుల సహకారం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి , డి ఆర్ డి ఏ పిడి శోభనబాబు, డి ఆర్ డి ఏ ఏ పి డి పి. ప్రభావతి, జిల్లా జీవనోపాదుల అధికారి టి. ధనంజయ రెడ్డి, తహసీల్దార్ భార్గవి, ఎం పి డి ఓ సౌభాగ్యమ్మ, గ్రామ సర్పంచ్ కరీముల్లా, ఏరియా కోఆర్డినేటర్ వనజాక్షి, ఎస్వీఈపి ఏపిఎం దూర్వాసులు నాయుడు. ఏపి ఎం కోమల, హస్తకళల సెక్రెటరీ దశరదాచారి, శ్రీ బాలాజీ వుడ్ కార్వింగ్ ఆర్టిజన్ మ్యూచువల్ ఎయిర్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షులు టి లోకనాథ ఆచారి, సెక్రెటరీ రాజా చారి, సీఈవో కృష్ణమూర్తి హస్త, కలంకారి కళాకారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చెర్లోపల్లి మాజీ సర్పంచ్‌కు నివాళి

నివాళి అర్పిస్తున్న చెవిరెడ్డి

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** తిరుపతి రూరల్, చెర్లోపల్లి మాజీ సర్పంచ్ రెడ్డప్ప నాయుడు(103) బుధ వారం కన్నుమూశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నివాళి అర్పించారు. 43 ఏళ్ల ఆయన చెర్లోపల్లి సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చెర్లోపల్లి సర్పంచ్ సుభాషిణి మాట్లాడుతూ దాదాపు 43 సంవత్సరాల పాటు ఏకధాటిగా పంచాయతీ ప్రజలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. రెడ్డప్ప నాయుడుకి నివాళులర్పించిన వారిలో ప్రముఖ కాంట్రాక్టర్ బొల్లునేని శుభగిరి నాయుడు, స్థానిక టిడిపి, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు, స్థానికులు ఉన్నారు.

# క్రైం న్యూస్

## 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**ప్రజాశక్తి-తిరుపతి (మంగళం):** శేషాచలం అటవీ పరిధి ఆంజ నేయపురం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించి 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి అటవీ క్షేత్రాధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. ముందుగా అందిన రహస్య సమాచారం మేరకు మామండూరు చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీని చేపట్టామన్నారు. వైయస్సార్ కడప జిల్లా వైపు నుండి ఒక కారు అతివేగంగా రావడానికి గమనించి కారును ఆపమని టార్చ్ లైట్‌లు వేశామన్నారు. అటవీ శాఖ అధికారులు తనిఖీ చేస్తున్నారని గ్రహించిన స్మగ్లర్లు కారు విడిచిపెట్టి పారిపోయారన్నారు. కారును పరిశీలించగా అందులో 15 ఎర్రచందనం దుంగలు ఉన్నాయన్నారు. ఎర్ర చందనం దుంగలను, కారును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ వాహన తనిఖీలలో టిఎన్ పాలెం సెక్షన్ ఎఫ్ఎస్ఓ ఆర్ఎస్ చైతన్య, కరకంబాడి బీటు ఎఫ్బిఓ వెంకటేశ్వరరావు, ప్రొటెక్షన్ వాచర్లు సిసింద్రీ, వెంకటేష్, ప్రసాద్, నవీన్, రవి పాల్గొన్నారు.

## ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలుశిక్ష

**ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)** తిరుపతి డివిజన్ నాగపట్ల బీటు పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, ఒకొక్కరికి రూ. 9 లక్షలు జరిమానా విధిస్తూ ఎర్రచందనం స్పెషల్ కోర్టు న్యాయమూర్తి నరసింహ మూర్తి గురువారం తీర్పునిచ్చారు. ఎర్రచందనం అక్రమ రవాణా ను నియంత్రించడంలో భాగంగా టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బా రాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణలో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదై విచారణ లో ఉన్న కేసులకు సరైన సాక్ష్యాధారాలను సేకరించి ముద్దా యిలకు శిక్ష పడేలా ప్రణాళికలు రూపొందించారు. క్రైమ్ నెంబరు 01/2017లో తిరుపతి డివిజన్ నాగపట్ల బీటు పరిధిలోని అటవీప్రాంతంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేస్తూ చంద్రగిరి మండలానికి చెందిన గౌస్ బాషా, శివ అనే ఇద్దరు పట్టుబడ్డారు. వారి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి గురువారం శిక్ష విధించారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు ఇద్దరు నిందితులను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. దీనిపై టాస్క్ ఫోర్స్ ఎస్పీ మాట్లాడుతూ ముద్దాయిలకు శిక్ష పడేలా కషి చేసిన కోర్టు సిబ్బందిని అభినందించారు. శేషాచలం రిజర్వు ఫారెస్టులోని విలువైన సహజ సంపద ఎర్రచందనం అక్రమ రవాణా కు పాల్పడే నెరస్తులకు ఇది ఒక హెచ్చరిక అని తెలిపారు.

## జనని మిత్ర యాప్‌పై అవగాహన

**ప్రజాశక్తి - రేణిగుంట:** తిరుపతి జిల్లా, రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాల కృష్ణ నాయక్ ఆదేశాల మేరకు కిరణ్ కుమార్ డిప్యూటి డెమో గర్భిణిలకు జనని మిత్ర యాప్ గురించి వివరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీల ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికి, వారి పర్యవేక్షణను సులభతరం చేయడానికి ప్రభుత్వం "జననీ మిత్ర" యాప్‌ను పరిచయం చేయడం జరిగిందన్నారు. ఈ యాప్ ఆరోగ్య సమస్యలను గుర్తించడానికి ఉపయోగపడుతుందన్నారు.

**IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: TIRUPATI**
**O.S.No. 75 of 2024**
Between :
Sri Kalahasthi Shankarachari ... **Plaintiff**
**And**
Sri Birudala Hemanth Kumar Reddy... **Defendant**
**To**
Sri Birudala Hemanth Kumar Reddy, S/o Late Narayana Reddy, Chairman and Managing Director, Birudala Constructions Private Limited, D-N0. 8-153/1, 2nd floor. New Balaji Colony, Tirupati -517501
WHEREAS the Plaintiff has instituted a suit against you for recovery of an amount of Rs.5,25,000/- with interest and etc. You are hereby summoned to appear in the Court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some other person able to answer all such questions on 14-07-2025 at 10:30 AM and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defense. In default of your appearance on the day before mentioned the suit will be heard and determine in your absence.
**Hg.Date.14-07-2025**
**// BY ORDER OF THE COURT //**
**B.MURALI MOHAN,**
**ADVOCATE FOR PLAINTIFF**
**TIRUPATI**

**IN THE COURT OF ADDITIONAL SUBORDINATE JUDGE AT PONNERI**
**MCOP NO: 92/2024**
Thota Dorababu - **Petitioner**
**Vs**
1.K.Krishnamoorthy
2.Shriram General Insurance Co. Ltd
- **Respondents**
**To**
**R1:** K.Krishnamoorthy, S/o. Kanna Kanna, No.6-53, Kandluru Village, KVB Puram Mandal, Thirupathi District, Andhra Pradesh-517 643. **-1st Respondent**
Please take Notice that the above case was filed by the Petitioner for Compansation, same was posted for your appearance to make any Objection on 17/06/2025 at 10.30 A.M. either in person or through your counsel if you fail to appear on that day case will be decided as Exparte.
**S.C.PALLAVAN,** B.SC.,B.L.,
Counsel for Petitioner

# పండు ఈగ... 'బుట్టలు' ఉన్నాయిగా..!

**ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు:** ప్రస్తుతం పంటలకు చీడపీడలతో పాటు పండు ఈగ కూడా రైతులకు సమస్యగా మారింది. అన్ని రకాల పండ్లపై పండు ఈగ ఉధృతి ఎక్కువ నష్టాన్ని కలిగిస్తాయి. ప్రస్తుతం మామిడిపై దీని ఉధృతి అధికంగా కనిపిస్తోంది. ఈ పండు ఈయగల నుండి మామిడి పంటను సస్యరక్షణతో కాపాడుకోవాలని మండల ఉద్యాన శాఖ అధికారి శివకుమారి రైతులకు సూచించారు. గురువారం చట్టేవారిపాలెం, అరికెలవాండ్లపల్లి, గోటూరు వాండ్లపల్లి, రంగనారిగడ్డ గ్రామాల రైతులతో కలిసి మామిడి తోటలను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. ఈ సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలల్లో కురిసిన వర్షాలకు పూత ఆలస్యం కావడంతో పంట కోత మే నెల నుండి ఆగస్టు వరకు కూడా కొనసాగే అవకాశం ఉందన్నారు. రుతుపవనాలు ముందుగానే రావడం వల్ల పంట కోతకు ముందే పండు ఈగ ఉధృతి ఎక్కువ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. పండు ఈగ నివారణ చర్యలు తప్పక చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ పండు ఈగలు మామిడి పక్వానికి రాకముందే (కాయలు నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పుడు) పచ్చి కాయలపై గుడ్లు పెడతాయన్నారు. గుడ్ల నుండి పిల్ల పురుగులు బయటకు వచ్చి కాయలోని గుజ్జును తింటాయని తెలిపారు. ఫలితంగా పండు కంది పోయినట్లుగా అవుతుందన్నారు. ఇలా పండు ఈగ ఎక్కువగా ఆశిస్తే కాయలు రాలిపోతాయన్నారు. పండు ఈగ సోకడంతో సుమారు 15 -20 శాతం మేర పండ్లకు మార్కెట్లో ధర తగ్గి నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పండు ఈగ ఆశించిన మామిడి పండ్లను వాటిపై ఉన్న రంధ్రాలను (సూదితో గుచ్చినట్లుగా) బట్టి గుర్తించవచ్చని తెలిపారు. అలాంటి పండ్లను కోసి చూస్తే అందులో పిల్ల పురుగులు కనిపిస్తాయన్నారు. ఈ పండ్లకు తర్వాత దశలో శిలీంధ్రం ఆశించి కుళ్లి పోతాయని తెలిపారు. పిల్ల పురుగులు పండ్ల నుండి బయటికి వచ్చి మట్టిలో కోశస్థ దశను గడుపు తాయని తెలిపారు.

### పండు ఈగ నివారణకు సూచనలు

పండు ఈగ ఆశించిన పండ్లను వెంటనే గుర్తించి కాల్చి వేస్తే ఉపయోగం ఉంటుంది. కాయలు నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పుడు, మిథైల్ యూజీనాల్

సూచనలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి శివకుమారి

కలిగిన లింగా కర్షక బుట్టలను భూమి నుండి 5-6 అడుగుల ఎత్తులో ఎకరానికి 5-6 అక్కడక్కడ అమరిస్తే పురుగులు ఆకర్షించబడటంతో వాటిని నివారించుకోవచ్చు. ఈ విషపు ఎర పసుపు లేదా తెలుపు రంగులో ఉంటే పురుగులు ఎక్కువగా ఆకర్షించబడతాయి. పసుపు రంగు జిగురు అట్టలని కూడా అక్కడక్కడ అమర్చుకోవాలి. పంట కోత సమయానికి మూడు వారాల ముందు, డెల్టామెత్రిన్-0.5మి. లీంఅజా డిరెక్టిన్ (3000పి.పి.యమ్)-2 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చెయ్యాలి. లీటర్ నీటికి 100 గ్రాముల బెల్లం, 2 మీ.లీ డెల్టా మిత్రిన్ కలిపి విషపు ఎర తయారీ చేసి పోలంలో అక్కడక్కడ అమర్చాలి. పంట కోత తరువాత కోశస్థ దశను నాశనం చేయటానికి లోతుగా దుక్కి దున్ను కోవాలి. 10 సంవత్సరాలు దాటిన చెట్లకు పిందె దశ నుండి కాయ నాణ్యత, పరిమాణం పెరగడం కోసం ఒక కేజీ యూరియా, అర్ధ కేజీ పొటాష్ పాదులో వేసి కలియబెట్టి నీరు పెట్టాలి, అర్క మ్యాంగో స్పెషల్ లేదా ఫార్ములా 4 సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని అందించుట ద్వారా కాయ పరిమాణం, నాణ్యత పెంపొందించు కోవచ్చు. మామిడికాయలు నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పటినుండి కాయలకి టేబుల్ వెరైటీలకి ఫ్రూట్ కవర్స్ వాడటం వలన పండు ఈగ, కాయ తొలుచు పురుగు, తామర పురుగుల నుండి కాయల్ని రక్షింపబడుటయే కాక, పురుగుమందుల వాడకం కూడా తగ్గించుకోవచ్చు. పురుగుమందుల అవశేషాలు లేని ఉత్పత్తులను పొందవచ్చు. కాయ రంగు, నాణ్యత, పరిమాణం పెరగడమే కాక ఎండ తాకిడి నుండి పండ్లను కాపాడుకోవచ్చు. మార్కెట్లో కూడా ఇలాంటి పండ్లకు మంచి ధర లభి స్తుంది. పంట కోతకు ఒక నెల ముందర నీటి తడు లను ఆపుట ద్వారా కాయలో చక్కెర శాతం, తీపిదనం పెరగడమే కాక నిల్వ సామ ర్థ్యం పెరిగి దూరప్రాంత రవాణా కు అనుకూలంగా ఉంటుంది. దశలవారీగా పక్వానికి వచ్చిన కాయల్ని కోయాలి. తద్వారా కాయ నిల్వ సామర్థ్యం పెరిగి రవాణాకి అనుకూలంగా ఉంటుందని సూచించారు.

**పుత్తూరు పురపాలక సంఘము** మునిసిపల్ కార్యాలయం, పుత్తూరు, తేది:29.05.2025
'ఇ' ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీసు ఆర్.ఓ.సి. నెం.2129/ఇ1/2024
పుత్తూరు పురపాలక సంఘము నందు పురపాలక సంఘ సాధారణ నిధుల నుండి 9 పనులకు గాను (టెండరు నిట్ నెం. 13/2025-26 & 15/2025-26 to 22/2025-26) అర్హత కలిగినవారు నుండి ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. సదరు పనులకు సంబంధించిన పూర్తి వివరములు ఇ-ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవలెను.
http://tender.apeprocurement.gov.in
కమీషనరు
పుత్తూరు పురపాలక సంఘం



# సనాతన ధర్మాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** సనాతన ధర్మాన్ని విస్తృతంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లేలా ప్రణాళికలు తయారు చేయాలని టిటిడి ఈవో జె శ్యామల రావు ఆదేశించారు. తిరుపతి శ్రీ పద్మావతి గెస్ట్ హౌస్‌లోని సమావేశ మందిరంలో హెచ్ డి పిపి, శ్రీనివాస కల్యాణం ప్రాజెక్ట్, అన్నమాచార్య ప్రాజెక్ట్, శ్రీ వేంకటేశ్వర రికార్డింగ్ ప్రాజెక్ట్, పబ్లికేషన్, పురాణ ఇతిహాస ప్రాజెక్ట్, దాస సాహిత్య ప్రాజెక్ట్, ఎపిక్ స్టడీస్, తదితర ప్రాజెక్ట్ అధికారులతో గురువారం టిటిడి ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భగవద్గీత సారాంశాన్ని పిల్లలు, యువతకు అర్థవంతంగా, సరళంగా ఉండేలా అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. హిందూ ధర్మం విశిష్టత, ధార్మిక, ఆధ్యాత్మిక, మానవీయత, నైతిక విలువల గురించి యువతకు తెలియజెప్పేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. మత మార్పిడులకు అడ్డుకట్ట వేసేలా ధార్మిక కార్యక్రమాలను తయారు చేయాలని సూచించారు. విద్యార్థులలో దైవభక్తి, నైతిక విలువలు, క్రమశిక్షణ, ఉమ్మడి కుటుంబవ్యవస్థ తదితర అంశాలపై యువతకు శిక్షణ ఇచ్చేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలన్నారు. భజన మందిరాలు ఇప్పటి వరకు ఎన్ని పూర్తి అయ్యాయి, చివరి దశలో ఎన్ని ఉన్నాయో సమగ్ర నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హిందూ ధార్మిక ప్రచార పరిషత్ ద్వారా ఇప్పటి వరకు అమలు చేసిన కార్యక్రమాలను సమీక్షించుకుని మరింత నాణ్యంగా, అందరికీ అందుబాటులో ఉండే విధంగా, ప్రణాళికా బద్ధంగా కార్యక్రమాలను అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. ధార్మిక కార్యక్రమాల నిర్వాహకులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చేలా ఇప్పటి నుంచే సంబంధిత ప్రతినిధులతో మాట్లాడాలని కోరారు. పచ్చదనాన్ని మరింత పెంచేలా శ్రీవారి దర్శనార్థం వచ్చి తిరిగి వెళ్లే భక్తుల ద్వారా గ్రీనరిని ప్రోత్సహించే విధంగా 'శ్రీవారి వన నిధి' ద్వారా ఒక మొక్కను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు.

అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న టీటీడీ ఈవో శ్యామల రావు

**ప్రత్యేక యూ ట్యూబ్ చానెల్‌లో ఒకే చోట అన్నమయ్య సంకీర్తనలు**

శ్రీవేంకటేశ్వర రికార్డింగ్ ప్రాజెక్ట్ పనితీరును టిటిడి ఈవో సమీక్షించారు. టిటిడి వెబ్ సైట్ లోని ప్రత్యేక యూ ట్యూబ్ చానెల్ లో తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తలను అన్నింటినీ ఒకే చోట ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమయ్య సంకీర్తనలలో ఇప్పటికే బాగా పాపులర్ అయిన వాటిని ముందుగా పొందుపరిచి, దశల వారీగా అన్ని సంకీర్తనలను అందులో ఉంచాలని సూచించారు. కొత్త సంకీర్తలు బాగా పాపులర్ అయ్యేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. అన్నమయ్య 32 వేల సంకీర్తనలలో 14, 932 సంకీర్తలు లభ్యమయ్యాయి. అందులో ఇప్పటి వరకు ఎన్ని సంకీర్తనలను రికార్డు చేశారు, ఇంకా ఎన్ని రికార్డు చేయాల్సి ఉంది, అన్నమయ్య కీర్తనల ప్రత్యేక వెబ్ పేజీలో ఎన్ని సంకీర్తనలు అప్ లోడ్ చేశారు, ఇంకా ఎన్ని చేయాల్సి వుందో సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. అనంతరం టిటిడి పబ్లికేషన్ శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. టిటిడి ముద్రించిన అన్ని పుస్తకాలు టిటిడి బుక్ స్టాల్స్‌లో లభ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పిల్లలకు, యువతకు అర్థవంతంగా, సులభతరంగా ఉండేలా కథనాలు రాసి ముద్రించాలన్నారు. ఇప్పటి వరకు టిటిడి ఎన్ని పుస్తకాలను ముద్రించింది, టిటిడి ఈ బుక్స్‌లో ఎన్నింటిని అప్ లోడ్ చేశారో వివరాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విశేష ఆదరణ పొందిన పుస్తకాలను ముద్రించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం, డిపిపి సెక్రటరీ శ్రీరామ్ రఘునాథ్, ప్రత్యేక అధికారి రాజగోపాల్, అడిషనల్ సెక్రటరీ రామ్ గోపాల్, అన్నమాచార్య ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి మేడసాని మోహన్, డైరెక్టర్ లత, దాస సాహిత్య ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్ బీఆర్ రామానందతీర్థాచార్యులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## వాటర్ కూలర్ వితరణ

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు, సంయుక్త నగర్, శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో గురువారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బత్తెన హనుమంతరావు కుమారుడు బత్తెన సనత్ కుమార్ (సన్ని) జ్ఞాపకార్థం పాఠశాలకు అవసరమైన టీచింగ్ మెటీరియల్స్, వాటర్ కూలర్, సి.పి.యు., ఫ్లోర్ కార్పెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు బండి శ్రీధర్ రెడ్డి, దాత బత్తెన హనుమంతరావు, శశిధర్, మునిగిరీష్, సీని యర్ రోటేరియన్ దశరథ రామిరెడ్డి, రోటరీ సెక్రెటరీ జి.జి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పణ

**ప్రజాశక్తి - రామచంద్రాపురం :**మండలంలోని నడవలూరులో గంగ జాతర వైభవంగా నిర్వహించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి గంగమ్మకు సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, మాధవి రెడ్డి, సి జనార్ధన్ చౌదరి, సాయి ప్రసాద్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, వేదాన్స్ రెడ్డి, వసంత్ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పలు కోర్సులకు ఎన్బిఏ గుర్తింపు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అంతర్భాగంగా వున్న శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలోని పలు కోర్సులకు న్యూఢిల్లీలోని మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలోని 'నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్' సంస్థ గుర్తింపును అందించింది. ఎస్వీయూలో పలు ఇంజనీరింగ్ కళాశాలను 2025, మే 7,8,9 తేదీలలో ఎన్.బి.ఏ. బృందం పరిశీలించింది. వర్సిటీ నిర్వహించే సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీ రింగ్ విభాగాలను సందర్శించింది. ఈ 5 శాఖలకు 2025 నుండి 2028 వరకు మూడు సంవత్సరాలు అనుమతి ఇచ్చింది.

## శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

**ప్రజాశక్తి - నాగలాపురం:** తిరుపతి జిల్లా, నాగలాపురం మండలం, సురుటపల్లి శ్రీ పల్లికొండేశ్వరస్వామి దేవస్థానమునకు సంబంధించి గురువారం దేవదాయశాఖ, తిరుపతి డివిజన్, తనఖీదారులు పణిరాజశయన పర్యవేక్షణలో, ఆలయ కార్యనిర్వహణాధికారిణి లత ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. 67 రోజులకు గాను దేవస్థానం హుండీల ద్వారా రు.5,73,453/-లు, అన్నదానం హుండీ ద్వారా రు.44,102/-లు, మొత్తం రు. 6,17,555.00లు ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ శివ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లతో సమీక్షా సమావేశం

**ప్రజాశక్తి -కోట :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రవేశపెట్టి నటువంటి పౌరసరఫరాల నిత్యవసర వస్తువులను పంపిణీ చేసే కార్యక్రమము పాత పద్ధతిలో మార్పు చేయడం జరిగిందని తహసీల్దార్ కే. జె జె రావు తెలిపారు.ఈ సందర్భంగా కోట మండలంలోని డీలర్లుతో ఎంపిడిఓ కాన్ఫరెన్స్ హాల్ నందు ఉన్నటువంటి అందరు డీలర్ల తో సమీక్షా సమావేశను నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్రప్రభుత్వం నుండి విచ్చేసిన పలు సూచనలు తెలియజేయడం జరిగింది.అదేవిధంగా ప్రతి రేషన్ షాప్ ఉదయం 8 గంటలు నుండి మధ్యాహ్నం 12 గంటలు వరకు , సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రతి ఒక్కరు కూడా షాప్ ను నిర్వహించాలని,అదేవిధంగా ఎవరైతే కార్డుదారులు షాపుకి వస్తారో వారికి మంచినీటి సదుపాయంతో పాటు కూర్చోవడానికి వసతి కల్పించాలని తెలిపారు.తర్వాత రేషన్ షాపు డీలర్ షాపులో నందు ధరలు పట్టికను,షాపు పేరును,స్టాక్ రిజిస్టర్ ను డిస్ప్లేలో పెట్టవలసి ఉందని 65 సంవత్సరాలు పైబడి వారికి,వికలాంగులకు స్వయంగా డీలర్ సరుకులు ఇంటికి వెళ్లి ఇవ్వాలని అందరూ రేషన్ షాపు డీలర్లకు సూచనలు ఇవ్వడం జరిగింది.అయితే జూన్ 6 వ తేది నుండి ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు తెలిపి,ప్రజలు దీనిని గమనించి సహకరించాలని తెలియజేశారు.మండలంలోని రేషన్ కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ఉర్దూ ఉపాధ్యాయ పోస్టుల పునరుద్ధరణ

**ప్రజాశక్తి-కోట:** కోట, వాకాడు మండలాల్లోని ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ పోస్టులను పునరుద్ధరిస్తున్నట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుండి ఆయా మండలాల శాఖ అధికారులకు ఉత్తర్వులు అందాయి. గత జగన్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మండలాలను ప్రాతిపదికగా తీసుకొని 18 కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలల్లో 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాల్లో విలీనం చేసిన క్రమంలో పలు పాఠశాలల్లో ఉర్దూ పోస్టులు రద్దు అయ్యాయి. దీంతో ఉర్దూ ఉపాధ్యాయులు దూరప్రాంతాలలో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.ఈ సమస్యపై తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యపై, ఉర్దూ పోస్టు లేనందువల్ల మైనారిటీ విద్యార్థులు ఉర్దూ విద్యకు దూరమవడం వల్ల కలిగే నష్టాలను గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. తిరుపతి జిల్లా కేంద్రంలో జరిగిన మైనారిటీ సదస్సులో టీడీపీ జాతీయ కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందజేశారు. గూడూరు ఎమ్మెల్యే ద్వారా మైనారిటీ మంత్రి ఫరూక్ అధిష్టానానికి తెలియజేశారు. ఈ నేపథ్యంలో కడపలో జరుగుతున్న మహానాడు వేదికగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ దృష్టికి మరోసారి జలీల్ అహ్మద్ తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే, జిల్లా విద్యాశాఖ అధికారికి సమస్యని వివరించి కోట, వాకాడు మండలాల్లో ఉర్దూ పోస్టులను యధావిధిగా పునరుద్ధరణయ్యేలా ఆదేశాలు జారీ చేయించారు. జలీల్ అహ్మద్ నిరంతర కృషితో కోట, వాకాడు మండలాల్లో ఉర్దూ పోస్టుల నియామకం జరిగినందుకు గాను మైనారిటీ కుటుంబాలు ఆయనకు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జలీల్ అహ్మద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాల వల్ల 40 సంవత్సరాలనుండి నిర్దిష్టంగా ఉన్న ఉర్దూ పోస్టు స్థానాలు చిన్నాభిన్నం అయ్యాయన్నారు. ఉర్దూ పోస్టుల పునరుద్ధరణ ప్రక్రియ కార్యరూపం దాల్చినందుకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు జలీల్ అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతి డీ ఈ ఓ, ఎమ్మెల్యే సునీల్ ను కలిసిన జలీల్ అహ్మద్

## హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

■ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** అభంశుభం తెలియని చిన్నారులపై హత్యాచారాలు చేసే వారిని అత్యంత కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. వైఎస్సార్ కడప జిల్లా కంబాలదిన్నెలో మూడేళ్ల చిన్నారిపై హత్యాచారం సొంత బంధువే చేయడం ప్రజలందరితోపాటు జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను ఎంతో కలిచి వేసిందని శుక్రవారం తన నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో చెప్పారు.

# సిపిఎల్ సీజన్ వన్ విజేత హైపిరియన్ జట్టు

**సిపిఎల్ నిర్వహించడం అభినందనీయం**

**నెల రోజుల్లో గొల్లవానికుంట గ్రౌండ్ అందుబాటులోకి తీసుకొస్తాం : జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్**

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** క్రీడాకారుడు ఎంత ఎక్కువ ప్రాక్టీస్ చేస్తే అంత గొప్పగా రాణించగలరని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గత 7 రోజులగా ఎస్వీయూ తారక రామా స్టేడియంలో జరుగుతున్న చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సిపిఎల్)సీజన్ వన్ ఫైనల్‌లో పాయ్ వైస్రాయ్ జట్టు పై హైపిరియన్ జట్టు ఘనవిజయం సాధించింది.ఈ ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అసోసియేషన్ సమిష్టి కృషితో సిపిఎల్ నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ తీసుకొస్తున్న ఇటువంటి ప్లాట్ఫారంను అందరూ ఉపయోగించుకోవాలన్నారు.

**సిపిఎల్ -1 విజేత హైపిరియన్ జట్టు**

మే 23 నుంచి మే 29 వరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన చిత్తూరు ప్రీమియర్ లీగ్(సిపిఎల్) సీజన్ వన్ ఫైనల్స్ లో హై పేరియన్ జట్టు ఘనవిజయం సాధించింది. మొదట తాసి గెలిచిన హై పేరియన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా, పాస్వర్డ్ బ్యాటింగ్ దిగిన పాయ వైశ్య జట్టు నిర్ణిత 20 భావలలో 130/9 పరుగులు చేసింది. బ్యాటింగ్లో వాహిద్ భాష 25 గిరీష్ కుమార్ 22 లోహిత్ 19 పరుగులు చేశారు. బౌలింగ్లో అనిల్ కుమార్,సయ్యద్ అహ్మద్ చిరా మూడు వికెట్లు పడగొట్టారు.132 పరుగుల సాధనలో బ్యాటింగ్కు దిగిన హైపిరియన్ జట్టు కేవలం 15 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 131 పరుగులు చేసి విజయం సాధించింది.బ్యాటింగ్ లో భవానీ ప్రసాద్ 68(47),కెప్టెన్ పృధ్విరాజ్ 32(24), వెంకటేష్ 27(19) పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.